ఆదివారం

ప్రజాశక్తి

ఫిబ్రవరి 17, 2002



బడ్జెట్ లొచ్చేస్తున్నాయ్!

లోపలిపేజీలో
హ్యాపీ బర్త్‌డే

హ్యాపీ బర్త్‌డే

పేరు : బి. మానస జోషి
వయస్సు : 4 సం॥, పుట్టిన తేది : 22-02-1998
తల్లిదండ్రులు : బి. వీణాజోషి, నాగరాజ్ జోషి
చిరునామా : బార్కూరు, ఉడుపి, కర్నాటక.

పేరు : ఎస్. సాయిరాం
వయస్సు : 5 సం॥, పుట్టిన తేది : 20-02-1997
తల్లిదండ్రులు : రత్నం, దుర్గారావు
చిరునామా : అడ్డతీగల

పేరు : డి. బేబి, అంబర్‌పేట్, హైదరాబాద్.
వయస్సు : 1 సం॥, పుట్టిన తేది : 17-02-2001
తల్లిదండ్రులు : డి. సునీత, నర్సింహ్మా
ఆశీస్సులు : డి. కృష్ణ, కవిత, డి. ఆనంద్, బాలమ్మ నర్సింహ్మా లక్ష్మి, హేమలత

పేరు : మెహరున్నీసా బేగం
వయస్సు : 2 సం॥, పుట్టిన తేది : 19-02-2000
తల్లిదండ్రులు : సరిత, ముస్తార్
చిరునామా : హకీంపేట్, టోలిచౌకి, హైదరాబాద్

పేరు : డాంగి వనిత
వయస్సు : 2 సం॥, పుట్టిన తేది : 17-02-2000
తల్లిదండ్రులు : ఉమా, ఉపేందర్
చిరునామా : గ్రా॥ ఎనుగల్ భట్టుతండా, మం॥ పర్వతగిరి , వరంగల్ జిల్లా.

పేరు : టి. శ్రావ్య
వయస్సు : 5 సం॥, పుట్టిన తేది : 17-02-1997
తల్లిదండ్రులు : లక్ష్మి, వేణు
చిరునామా : తిరువూరు, కృష్ణాజిల్లా.

పేరు : సయ్యద్ మహ్మద్ సమీర్
వయస్సు : 1 సం॥, పుట్టిన తేది : 20-02-2001
తల్లిదండ్రులు : అస్మా సాజిత్, మహ్మద్ అస్లం
చిరునామా : బి.కె. ఎం. స్ట్రీట్, కడప.

ప్రాణాంతక సంక్రమిత వ్యాధి రేబీస్

● రేబీస్ చాలా వరకు కుక్కకాటు వల్ల వస్తుంది. కాని కుక్క గాయంపై నాకడం, గీరడం కూడా ఈ వ్యాధికి కారణాలు.

● రేబీస్ విషయంలో పెంపుడు కుక్క లేదా వీధి కుక్క అని వ్యత్యాసం లేదు.

● పిల్లి, కోతి, పశువులు, ఒంటె, నక్క తోడేలు, గబ్బిలం లాంటి పెంపుడు లేదా అడవి జంతువుల వలన కూడా ఈ వ్యాధి సంక్రమిస్తుంది.

● ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం 30-50 శాతం రేబీస్ బాధితులు పిల్లలే.

● ఆధునిక కణజాల (టిష్యుకల్చర్) పద్ధతిన తయారైన రేబీస్ టీకా బాధారహితమైనది. ఇది పురాతన రేబీస్ టీకాలాగా 14 టీకాలు బొడ్డు చుట్టూ కాక కేవలం 5 టీకాలు (0.5 యం.యల్. ఒక టీకా) చేతికి తీసుకుంటే సరిపోతుంది.

● రేబీస్ వ్యాధికి నివారణ లేదు. ఇది ప్రాణాంతకమైనది.

సత్వరమే చేయాల్సినవి.... (ప్రాథమిక చికిత్స)

ప్రాణాంతకమైన రేబిస్ వ్యాధి నివారణకు ప్రాథమిక చికిత్స అనేది ప్రాణ రక్ష చికిత్స అని మరువరాదు.

✔ జంతువు కాటు వల్ల ఏర్పడిన గాయాన్ని ధారాళమైన నీటితో (కుళాయి నీళ్ళ కింద అయితే మరీ మంచిది), సబ్బుతో కడగాలి.

✔ గాయానికి పట్టిచ్చిన సబ్బునంతా కడిగి వేసిన తర్వాత బెంజాల్కోనియం క్లోరైడ్, స్పిరిట్ ఇథనాల్) అయోడిన్ టింక్చర్, పొవిడోన్ అయోడిన్, డెట్టాల్ వంటి యాంటిసెప్టిక్స్ పూయాలి.

✔ తక్షణమే వ్యాక్సినేషన్ చేయించుకునేందుకు మీ సమీపంలోని డాక్టర్‌ను సంప్రదించండి.

✔ రేబిస్ రాకుండా మిమ్మల్ని మీరు కాపాడుకునేందుకు వ్యాక్సినేషన్ ఒక్కటే మార్గం.

చేయకూడని పనులు....

✗ జంతువు కాటు వల్ల ఏర్పడిన గాయానికి కట్టు కట్టడం లేక బ్యాండేజి చేయించడం

✗ గాయానికి కట్టు వేయడం.

✗ మంట పుట్టించే 'ఆకుపసర్లు', కాఫీపొడి, కారపుపొడి, లోహాలు, నాణేలు, యాసిడ్స్, క్షారాల వంటివి గాయంపై ఉంచడం.

✗ గాయాన్ని కాల్చడం.

డాక్టర్ సలహాలు



నా వయస్సు 53 సంవత్సరాలు. సుమారు 10 సంవత్సరాల క్రితం మోకాళ్ళ నుండి చీమును తీశారు. షుమారు వారం పది రోజులు కాళ్ళకు బరువు వేలాడదీశారు. ప్రస్తుతం కాలు బాగానే వుంది. బాగా నడవగలుగుతున్నాను. నెల రోజుల క్రితం ఉదయం లేచి కూర్చునేసరికి కుడిచేతి గూడు విరిగిపోయినట్లనిపించింది. అప్పటి నుంచి చెయ్యి (కుడిచెయ్యి) ఒకటే విపరీతమైన పోటు. రాత్రిపూట నిద్ర వుండదు. మందులు కూడా వాడాను. ట్రాక్షన్ వేయించుకున్నాను. అయినా ప్రస్తుతం మెడ నుండి ఛాతీ వరకు వున్న ఈ ప్రాబ్లమ్‌కు సరైన సూచన ఇవ్వగలరు. ఎక్సర్‌సైజు, సరైన డాక్టర్‌ను తెలుపగలరు.

-ఎస్.అభీక్షం, పాలకొల్లు

మీరు రాసిన దాన్ని బట్టి మీకు కుడిచేయి భుజం నుండి వేళ్ళ దాకా విపరీతమైన నొప్పితో బాధపడుతున్నారని అర్థమయింది. దీనికి రెండు కారణాలు వుండవచ్చు. 1. నాడీమండల సంబంధమైన బ్రేకియన్ న్యూరాల్జియా 2. రక్తనాళాలకు సంబంధించి కుడి చేతికి రక్తం అందించే ప్రధాన రక్తనాళం ఒత్తిడికి గురై చేతికి సరిపోయినంత రక్త ప్రసరణ జరగకపోవడం. ఈ రెండింటిలో దేనివల్ల మీకు బాధవస్తున్నదో పరీక్ష చేయకుండా చెప్పడం కష్టం. ప్రాథమికంగా మీకున్నది ఎముకలకు సంబంధించిన సమస్య కాదనిపిస్తోంది. అందువలన మీరు న్యూరాలజిస్టునుగాని, ఫిజీషియన్‌నుగానీ సంప్రదించండి.

నా వయస్సు 30 సంవత్సరాలు. మూడు సంవత్సరాల నుంచి పైల్స్ వున్నాయి. అవి అప్పుడప్పుడు చాలా నొప్పిగా వుంటాయి. చాలా మందులు వాడాను. కాని నొప్పి తగ్గలేదు. లేటెస్ట్ ఇన్‌ఫ్రా రెడ్‌రేస్ గురించి విన్నాను. దానిగురించి వివరాలు తెలుపగలరు.

- జి.ఎస్.రావు, వైజాగ్

పైల్స్‌ను శాస్త్రీయంగా హిమరాయిడ్స్ అంటారు. వీటిని మొదటి డిగ్రీ, రెండవ డిగ్రీ, మూడవ డిగ్రీ హిమరాయిడ్స్‌గా వర్గీకరిస్తారు. మొదటి డిగ్రీ హిమరాయిడ్స్‌కు సాధారణంగా వైద్యం అవసరం లేదు. రెండవ, మూడవ డిగ్రీ హిమరాయిడ్స్‌కు లక్షణాల తీవ్రతను బట్టి చికిత్స అవసరం. హిమరాయిడ్స్ వున్న వారికి నొప్పి కన్నా మలవిసర్జన సందర్భంలో రక్తస్రావం జరగడం ముఖ్య లక్షణం. మీకున్నది హిమరాయిడ్స్ అవునా, కాదా అనే విషయం నిర్ధారించుకోవడం ముఖ్యం. చికిత్స విషయానికి వస్తే లక్షణాల తీవ్రతను బట్టి 1. ఏనల్ డైలటేషన్ 2. బాండింగ్, 3. స్క్లీరో థెరపీ, 4. హిమరాయిడెక్టమీ అనే ఆపరేషన్ వీటిలో ఏదైనా చేయవచ్చు. మీరు పేర్కొన్న లెటెస్ట్ ఇన్‌ఫ్రారెడ్‌రేస్ గురించి వినడం ఇదే. అలాంటి వైద్యం ఏదీ లేదు.

నాకు పెళ్ళయి నాలుగు సంవత్సరాలవుతుంది. మొదట్లో చాలా బలంగా వుండేవాడిని. మూడు సంవత్సరాలుగా చాలా నీరసంగా వుంటోంది. నాకు రెండు సంవత్సరాల కొడుకు. ఎంత అన్నం తిన్నా బలం లేక సొలుగుతూ వుంది. దయచేసి మంచి మందులు తెలపండి.

- కె.వెంకటేష్, జనగాం

మీకు పెళ్ళి కావడానికి, మీరు బలహీనంగా వుండటానికి సంబంధం లేదు. మీ వయస్సు తెలియజేస్తే బాగుండేది. మీరు ఏమైనా బరువు తగ్గుతున్నారా? లేక తగ్గారా? అనే విషయం ముందు చూడండి. రెండవది మీకు సాయంత్రం పూట జ్వరం రావడం గానీ, ఆకలి తగ్గడం గానీ, రాత్రిపూట నిద్రలో ఎక్కువసార్లు మూత్ర విసర్జనకు లేవవలసిన అవసరం ఏమన్నా వస్తోందా? లేక విరోచనాలు తరచుగా అవుతున్నాయా అనే విషయాలు పరిశీలించండి. పైన చెప్పిన లక్షణాలు ఏమీ లేకపోతే మీకు ఏ వ్యాధీ లేనట్లే. ఏ మందులు, పరీక్షలు అవసరం లేదు. పైన చెప్పిన లక్షణాలు ఏమైనా వుంటే మీకు అందుబాటులో వున్న వైద్యుణ్ణి సంప్రదించండి.

- డాక్టర్ పి.అజయ్‌కుమార్

డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల, నెల్లూరు

గుండెల భారం

అంపశయ్య నవీన్

ఐదారు రోజుల క్రితం అమెరికాలో వుంటున్న ఓ మిత్రుడు ఇండియాకొచ్చి నన్ను చూసిపోదామని మా ఇంటికొచ్చాడు. అతడు అమెరికా వెళ్ళిపోయి పాతికేళ్ళు గడిచిపోయాయి. పాతికేళ్ళ తర్వాత అతడు భారతదేశానికి రావడం ఇదే మొదటిసారనీ, ఈ పాతికేళ్ళలో అతడు నన్ను ఎన్నోసార్లు గుర్తు చేసుకున్నాననీ చెప్పాడు. అతని పేరు సత్యం.

అతడు ఇండియా నుండి అమెరికాకు వెళ్ళిపోవడం చాలా విషాదకర పరిస్థితిలో జరిగింది. పాతికేళ్ళ క్రితం - పందొమ్మిది వందల డెబ్భై ఆర్లో అనుకుంటాను - అతడో అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయి కూడా ఇతడంటే ఇష్టపడింది. ఇద్దరూ చూడటానికి చాలా అందంగా ఉంటారు. వాళ్ళది చాలా అందమైన జంట అవుతుందని అందరూ అనుకున్నారు. ఆ అమ్మాయి తల్లిదండ్రులు కూడా మొదట్లో వాళ్ళిద్దరి పెండ్లికి పెద్దగా అభ్యంతరాలేమీ చెప్పలేదు - త్వరలోనే వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకొని హాయిగా ఉంటారనుకుంటున్న తరుణంలో ఆ అమ్మాయి తల్లిదండ్రులు ఆ అమ్మాయికి వేరే సంబంధం చూశారు. ఈ సంబంధం చాలా గొప్పదని, ఈ అబ్బాయి తండ్రికి రాజకీయమైన పలుకుబడి చాలా ఉందని, ఇతణ్ణి చేసుకుంటేనే నీకూ, మాకూ చాలా గొప్ప భవిష్యత్తు ఉంటుందనీ ఆ అమ్మాయికి చెప్పారు. మొదటి అబ్బాయిని మరచిపోయి ఈ రెండో అబ్బాయినే చేసుకోవాలని పట్టుబట్టారు. ఏనాడూ తల్లిదండ్రుల మాటకు ఎదురు చెప్పకుండా పెరిగిన ఆ అమ్మాయి కొంత అయిష్టంగానే తల్లిదండ్రులు తెచ్చిన ఈ రెండో సంబంధాన్నే చేసుకోవడానికంగీకరించింది. సత్యంతో నన్ను మరచిపొమ్మని చెప్పేసింది. కానీ సత్యం ఆ అమ్మాయి అలా చెప్పడంతో దిగ్భ్రాంతి చెందాడు - "నువ్వు నన్ను కాదని ఆ వేరే అబ్బాయిని చేసుకుంటే నేను విషం తాగి చచ్చిపోతాన"న్నాడు - నాతో కాకుండా నీ పెళ్ళి మరొకరితో జరిగిన రోజు నువ్వు నా శవాన్ని చూస్తావన్నాడు - దాంతో ఆ అమ్మాయి విపరీతమైన మానసిక ఒత్తిడికి గురయింది. ఒకవైపు చిన్నప్పట్నించి తనను అల్లారు ముద్దుగా పెంచుకున్న తల్లిదండ్రులు - మరోవైపు తనను గాఢంగా ప్రేమిస్తున్న ప్రియుడు - తను తల్లిదండ్రుల మాట విని సత్యాన్ని కాకుండా వేరే అబ్బాయిని చేసుకుంటే సత్యం నిజంగానే విషం తాగి చచ్చిపోతాడేమోనని ఆ అమ్మాయి వణికిపోయింది - తల్లిదండ్రులేమో వేరే అబ్బాయితో ఆమె పెళ్ళికి ముహూర్తం పెట్టేసి, పెళ్ళి ఏర్పాట్లు మొదలెట్టారు. ఇద్దరి మధ్యా నలిగిపోయిన ఆ అమ్మాయి పెళ్ళింకా వారం రోజులుందనగా నల్లుల మందు తాగేసి ఆత్మహత్య చేసుకుంది. ఇది తెలిసిన సత్యం విపరీతంగా చలించిపోయాడు. తనూ ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కానీ అతని మిత్రులు కొందరు అనుక్షణం అతనికి కాపలాగా ఉండి కాపాడారు. అతని మిత్రుల్లో ఒకరికి నేను నవలలు రాస్తానని తెలుసు - ఆ మిత్రుడే సత్యాన్ని ఓ రోజు నా దగ్గరకు తీసుకొచ్చాడు - సత్యం ఓ రెండు మూడు గంటల సేపు తన బాధనంతా నాతో చెప్పుకున్నాడు. అతడు చెబుతున్నదంతా నేను చాలా ఓపిగ్గా విన్నాను - ఆ రోజు నుండి ఆ అబ్బాయి ప్రతిరోజూ నా దగ్గరకొచ్చి, ఓ రెండు గంటల సేపు కూర్చొని, తను ప్రేమించిన ఆ అమ్మాయిని గూర్చి అనేక విషయాలు చెబుతూ, తన గుండెల భారాన్ని తీర్చుకుంటుండేవాడు - " ఆ అమ్మాయి చావుకు నేను కూడా ఒక కారణమే... నువ్వు వేరే అబ్బాయిని చేసుకుంటే నేను విషం తాగి చస్తానని నేను అనిఉండకపోతే ఆ అమ్మాయి బతికేదే..... కాదంటారా?" అన్నాడో రోజు. అతనికి నేనేమీ సమాధానం చెప్పలేదు - మరోరోజు ఆ అబ్బాయి "నా ఈ కథను మీరో నవలగా రాస్తారా మాష్టారూ?" అన్నాడు రాస్తానని చెప్పాను. "ఎప్పుడు రాస్తారు? వెంటనే రాసెయ్యండి మీరేం రాస్తారో చదవాలని నేను అనుక్షణం ఎదురు చూస్తుంటాను" అన్నాడతడు.



ఆ తర్వాత ప్రతి వారం రోజులకొకసారి మా ఇంటికొచ్చి "నవల రాశారా సార్?"అని అడిగిపోతుండేవాడు.

ఓ ఆర్నెల్ల తర్వాత నేనా నవల కరుణ అనే పేరుతో రాశాను - దాన్నో ప్రముఖ పత్రిక ప్రచురించింది. ఆ అబ్బాయి ఆ నవల ఐదారుసార్లు చదివి నా దగ్గరకొచ్చాడు.

"మీరు రాసిన నవల చాలా బావుంది సార్" అన్నాడు - ఆ మాట అంటున్నప్పుడు అతని కళ్ళల్లోకి కన్నీళ్ళు ఉబికి వచ్చాయి. కాస్సేపాగి అతడే మళ్ళీ అన్నాడు :

"నాకు చాలా ఆశ్చర్యం కలిగించిన విషయమేమిటంటే మీరా నవలలో ఎవరి పక్షమూ తీసుకోకపోవడం. అందరమూ కలిసి - ఆ అందరిలో నేను కూడా ఉన్నాను - ఆ అమ్మాయిని ఈ ప్రపంచంలోంచి పంపించేశాం - అన్న విషయమే మీరు చెప్పారు. ఈ నవల్లో నన్నో హీరోను, ఆమె తల్లిదండ్రుల్నీ, ఆ వేరే అబ్బాయినీ విలన్లనూ చేస్తారనుకున్నారు. కానీ మీరట్లా చెయ్యలేదు. ఆ అమ్మాయి చనిపోవడానికి ఈ సమాజమూ, ఆమె తల్లిదండ్రులూ, ఆమెను ప్రేమించానని ఆమె వెంటపడ్డ నేనూ - అందరూ కారకులేనని మీరు రాశారు. మొదటిసారి చదివినప్పుడు మీరు నాకు చాలా అన్యాయం చేశారనిపించింది - ఆ నవలను చదివిన నా మిత్రులు కూడా నీకాయన చాలా అన్యాయం చేశాడనే అన్నారు - కానీ రెండోసారి, మూడోసారి, నాల్గోసారి చదివాక మీరు చాలా కరెక్టుగానే రాశారనిపించింది - ఆ అమ్మాయి మా అందరి మధ్య ఎలా నలిగిపోయిందో, ఆమెది ఎంత సున్నితమైన హృదయమో మీరు చాలా అద్భుతంగా చిత్రించారు. నిజంగా జరిగిన సంఘటనను నవలగా రాసి ఒప్పించటం రియల్లీ గ్రేట్! హేట్సాఫ్ టుయూ సార్" అంటూ అతడు వెళ్ళిపోయాడు - ఆ తర్వాత అతడు మళ్ళీ కనిపించడం ఇప్పుడే!

అతన్ని అతని బంధువులందరూ కలిసి స్టేట్స్‌కు తీసుకెళ్ళారని, అక్కడే ఏదో ఉద్యోగంలో చేర్పించారని, పెళ్ళి కూడా చేశారనీ అతని మిత్రులు నాకు చెప్పారు.

ఇప్పుడు, ఇంతకాలానికి అతడు నన్ను చూడటానికి రావడం నన్ను నిజంగా కదిలించింది. - "ఎలా ఉన్నావు సత్యం?" అంటూ అతన్ని ఆప్యాయంగా పలకరించాను-

"బాగానే ఉన్నాను సార్!" అని అతడు అన్నప్పటికీ అతని మొఖంలో పాతికేళ్ళ క్రితం కనిపించిన ఆవిషాద ఛాయలు ఇప్పుడూ కనిపించాయి-

"అప్పట్లో ఓ పత్రికలో వచ్చిన మీరు నా గురించి రాసిన ఆ నవల పుస్తకంగా వచ్చిందా సార్!" అన్నాడతడు.

"పుస్తకంగా ఐదారేళ్ళ క్రితమే వచ్చింది - నువ్వు చూళ్ళేదా?" అన్నాను.

"చూళ్ళేదుసార్! నాకా పుస్తకం కావాలిసార్! ఇస్తారా?" అన్నాడతను.

"తప్పకుండా" అంటూ నేనా పుస్తకాన్ని తెచ్చి, నా ఆటోగ్రాఫ్ చేసి అతని చేతికిచ్చాను

అతడా పుస్తకాన్ని తన గుండెలకు హత్తుకున్నాడు-

"నేనీ పాతికేళ్ళలో అమెరికాలో ఉంటూ ఎంతో ఆస్తి సంపాదించాను సార్ - కానీ ఆ ఆస్తికంటే ఇప్పుడు మీ దగ్గరకొచ్చి, మిమ్మల్ని కలిసి, మీ చేతి నుండి ఈ పుస్తకాన్ని పొందటం ఎన్నో రెట్లు గొప్ప ఆస్తి సార్... మిమ్మల్ని నేనెప్పుడూ మరచిపోలేను.. ఆ రోజుల్లో నేను మీతో ఎన్ని గంటలు మాట్లాడానో... మీరెంత ఓపిగ్గా విన్నారో.. నా గుండెల భారాన్ని ఎలా తీర్చుకోనిచ్చారో... నా బాధనంతా మీరో నవలగా రాసి నన్నెంతగా నన్ను నేను అర్థం చేసుకునేలా చేశారో - నేనెప్పుడూ మరచిపోలేను సార్... మనం చెప్పింది ఓపిగ్గా విని మనలిన మంచి మనసుతో అర్థం చేసుకునే వాళ్ళు ఈ ప్రపంచంలో చాలా తక్కువ మందుంటారు సార్! ఏదన్నా ఓ సంఘటన జరిగితే దాంట్లో ఎవరి తప్పో, ఎవరిది ఒప్పో టకీమని జడ్జ్ చేసేసేవాళ్ళే ఎక్కువమందుంటారు సార్... మీరలా ఎవర్నీ జడ్జ్ చేయకుండా, అందర్నీ అర్థం చేసుకొని, అందరిమీద సానుభూతి చూపించారు... దట్స్ రియల్లీ గ్రేట్..." అంటూ సత్యం వెళ్ళిపోయాడు.

ఇన్నేళ్ళ తర్వాత కూడా... అదీ అత్యంత సంపన్నదేశంగా పేరు పొందిన అమెరికాలో ఉంటూ - అతను ఏ మాత్రం కూడా మారకపోవడం - ముఖ్యంగా అతనిలోని ఒకప్పటి ఆ ఆర్ద్రతని అలాగే కాపాడుకోవడం - నన్ను ముగ్ధుణ్ణి చేసింది. ★



మాటలకోట-44

1		2	●	3	●	4	●	5	
	●	6		●	7	●	8		●
●	9		●	10				●	11
12		●	13			●	14	15	●
●	16				●	17	●	18	
19		●		●	20		21		●
●	22	23	●	24		●		●	25
26	●	27	28		●	29		●	
30		●		●	31		●	32	
	●	33			●	34			●

అడ్డం

1. ముల్లు (3)
3. 'తి' చేరితే స్త్రీ (1)
4. 'ల్లు'తో గృహం (1)
5. రాదని చెప్పండి (2)
6. వాయువు (2)
8. హస్తం, కరము (2)
9. చివర కోల్పోయిన నురుగు (2)
10. కనపడు..2,4,1,3 (4)
11. 'క' తోడైతే పక్షి రెక్కలోని ఒక భాగం (1)
12. 'అవ్వ' అని ఖచ్చితంగా చెప్పండి (2)
13. గొడవ, ఘర్షణ (3)
14. లుకలుకల్లో ఒకటే (2)
16. చెరసాల (4)
18. మాట (2)
19. కంప్యూటర్‌లో ఒక భాష (2)
20. ఈ పాకం చాలా ప్రసిద్ధమైంది (4)
22. ఒక పూవు (2)
24. గ్రాసం (2)
27. విషం (3)
29. మిక్కిలి, అధికం (2)
30. కరవాలం (2)
31. ఒక హీరోయిన్ (2)
32. కరుణ (2)
33. గాలిపటం (3)
34. ధర (3)

నిలువు

1. రంధ్రం (2)
2. ఆస్ట్రేలియాలో మాత్రమే కన్పించే ఒక జంతువు (3)
5. స్టోన్ (2)
7. తడబడ్డ శివుడు (3)
8. బహువచనంలో చేప (3)
9. తరుణ్ హీరోగా మొదటి చిత్రం (5)
10. పెద్ద పట్టణం (3)
13. అడ్డం 13లాంటిదే మరో విధంగా (3)
15. సంక్రాంతి తరువాతి రోజు (3)
17. స్వప్నం (2)
20. నడుము (2)
21. అడ్డం 20లో ఒకరు (3)
23. సందు, బజారు ఇలా కూడా అంటారు కాకపోతే తిరగబడింది (2)
24. కుత్తుక, గొంతు (2)
25. ఇంటిముందు భాగం (3)
26. నిమిషంలో 60వ వంతు (3)
28. వెండి (3)
29. సమాచారం (3)
32. పొద్దు (2)

గతవారం జవాబులు

అడ్డం : 1. సరి 2. చీ 3. అపనమ్మకం 7. చిం 8. పంచదార 11. వరాహం 14. అవని 15. సఫలం 17. గావుకేక 19. తగు 22. రుచి 24. చె 25. రామా 27. ఆపద 28. రంభ 29. కనికరం 31. ఈజీ 34. జిగి 36. వినోదం 38. పాడీపంట 39. రిక్తం

నిలువు : 1. సమీపం 4. పహారా 5. మ్మఅ 6. సదా 9. చదువు 10. రఅక 11. వనిత 12. హంస 13. జలం 16. ఫలం 17. గాభరా 18. కేకు 20. గురు 21. అపరంజి 23. చిరంజీవి 26. మూక 27. ఆక 30. నిక్షేపం 32. నాదం 33. పీప 35. గిరి 37. నోము

ఎలా? ఎలా??: సింపుల్. అంకె చివర ఉన్న 3ను తీసుకువచ్చి అంకె మొదట్లో వేయండి. అదే జవాబు.

ఎంత : పుట్టిన రోజు నాడే అరవిందుకు 10 సంవత్సరాలు వస్తాయి. కనుక అంతకు ముందు 9 సంవత్సరాల వయస్సు ఉంటే పుట్టినరోజు నాడు 10, మరుసటి సంవత్సరం 11 సంవత్సరాల వయస్సన్నమాట

...లా ఎలా??

...సుధ ఇంటికి వెళ్లింది. ఆదివారం కావడం ...డా అక్కడికి వచ్చారు. ఏ ఆట ఆడుకుందాం ...మా ఆడే ఆటలే గుర్తుకు వచ్చాయి. ఇంతలో ...్న విప్పమన్నాడు. మీరు కూడా ట్రై చేయండి. ...మ్మ కాయలు అమ్ముతున్నాడు. మొదట ...ానిమ్మ కాయల్లో సగం కాయలతో పాటు ... వ్యక్తి వచ్చి అప్పటికి బుట్టలో ఉన్న వాటిల్లో ...ం దానిమ్మను కొన్నాడు. మూడో వ్యక్తి వచ్చి ...మ్మ కాయలను మరో సగ భాగం దానిమ్మను ...అయ్యింది. పండ్లు అమ్మే వ్యక్తి ఒక్క దానిమ్మ ... మీరు చెప్పాల్సిందల్లా అసలు పండ్లు అమ్మే ...ం ఎన్ని?

...ంత?

...కెను వరుసగా కూడి చూడండి. ... వచ్చింది కదా. ఇవే అంకెలను గుణించండి. ...ానాన్ని క్షణాల్లో చెప్పడంతో పాటు ఏ పేపర్ ...డీ...స్టార్ట్

మనిషే మారణాయుధమైతే...!

గుండె మందుపాతరై
రక్తనాళాలు తుపాకీ గొట్టాలై
రక్తం విస్ఫోటిస్తే
ఇక మనిషేం కావాలి?
శిరోజాలు శూలాలై
కళ్లు గాజు ముక్కలై
పళ్లు రంపపు ముళ్లై
విరుచుకు పడితే
ఇక బతుకేం కావాలి?
చెట్టు తుపాకీగా మారి
పిట్ట ఏజెంట్‌గా మారి
మనిషే మారణాయుధమైతే
ఇక ధరిత్రి ఏం కావాలి?

-ఎల్. జీవన్, హన్మకొండ

అప్పు పప్పు మస్తు ఆందోళన కసరత్తు

రుక్మిణి

వెంకట్రాం పొద్దునపొద్దున్నే వాళ్ల అయ్య బుర్ర రాంకీర్తన పాడించడం... అది పగిలిపోవడం అపుడు ఊర్లో పెద్ద వార్తే అయింది. జనం ఆదరాబాదరాగా పంచీలు సర్దుకుంటూ గోలగోలగా వెంకట్రాం యింటికి చేరేసరికి పరిస్థితి పరమ వికారంగా వుంది. తల పగలేసింది చాలక అదే దుడ్డుకర్రతో వెంకట్రావుడు వరండాలో చిందులేస్తూ శివాలు తొక్కుతున్నాడు. చేతిలోనిదుడ్డుకర్రను రకరకాలుగా వూగిస్తూ జనాల్ని బెంబేలెత్తిస్తున్నాడు. అనవాయితీగా వాడి నోట్లోనుండి దారాళమైన బూతులు కూడా...

"అరె... ఒకసారి చెప్తే వినే రకం కాదాయె.. వీని తండ్రికినా... అదిగాదుర యాద్గిరీ.. నెత్తీనోరూ లబలబ కొట్టుకుని ఒక పక్కనేను చెప్తనే వున్నానా... అహఁ.. అది వినే రకం కాదు. ఓర్నీ! ఓరి జక్కులోడా... నీకూ ఓ తలమాసిన అయ్య ఓడున్నాడు గదా! వాడూ గిట్లనే చేస్తన్నాడ్రా? చేస్తే నువు వూరుకుంటావుర? వాడి కొంకులిరగదీస్తవు గద! కద!" వెంకట్రాం జక్కులోడి చొక్కా దొరకబుచ్చుకుని మరి వదలకుండా అదే విషయాన్ని అదే పనిగా రెట్టించి పారేస్తున్నాడు. వాడు కడుపులోనే బాంబు పేలినట్లు హడలిపోయాడు. బిక్కచచ్చి - దద్దరిల్లిపోయాడు - ఎంత గింజుకున్నా వదలడే!

"జక్కులోడా... నువు చెప్పితీరాలి! చెప్తవా - లేదా? మీ అయ్య రెండు కాళ్ళు విరిచి పొయ్యిలో పెడతావా - లేదా? చెప్పుబే.. అరె.. మల్లేశా.. చెప్పిందనక వీడ్ని వదలను. అంతే! చెప్పురా... నువ్వయితే మీ అయ్య రెండుకాళ్ళు... రెం.. డు...!

జక్కులోడు నేరక అంత పొద్దున్నే వచ్చి వీడికి చిక్కడం.. వాడు తననట్లా దొరక బుచ్చుకుని, ఓ చేత్తో దుడ్డు కర్రా.. చొక్కా ఒడిసి పట్టుకుని ఇరకాటాన పెట్టడం ఏమాత్రం రుచించక తల అడ్డదిడ్డంగా వూపాడు. ఏం చెప్పాలే? అసలు లోపల వీడి అయ్యా.. వాడి బుర్రకాయా ఏ స్థితిలో వుందో ఏ మాత్రం మతలబు కూడా లేదు గదా? గిజగిజలాడిపోయాడు జక్కులోడు. అసలు విషయం తెలవదుగదా!

"అరె ముందు నువు పగలేసిన మీ అయ్య బుర్రకాయ సంగతి చూడవేరా? వాడ్ని వదిలెయ్! అరె.. వదల్రా..!" మల్లేశు లౌక్యంగా వాడ్ని గద్దించే సరికి వాడు కాస్తంత తన వుడుంపట్టు సడలించాడుగదా! హమ్మయ్య!

లోపల నులక మంచం మీద రక్తం ఓడుతున్న వెంకట్రాం తండ్రి పరిస్థితి మరింత భీకరంగా వుంది. ముసిలోడు ప్రపంచకంలోని సమస్త రకాల బూతులనూ కలబోసి పెద్దగొంతుకతో అరుస్తూ యమా రొప్పుతున్నాడు. చేతులు లపలప వూగిస్తూ లొడలొడ ఒకటే అరుపు!

"అరె లోకంలో ఎవడూ పిల్లల్ని కంటంలే! ఇంత ఇంటి పెద్దను.. నా కష్టాలు నావి! కాదా... కాదని చెప్పే దమ్ములెవడికున్నాయిరా? ఒరే... యాద్గిరీ.. నీకున్నాయిరా.."

పెద్ద అరుపుతో ముసిలోడు మంచం మీద నుండి గెంతి యాద్గిరిని ఒడిసి పట్టుకొని బూతులూ.. ఉదాహరణలూ కలిపి.. దాన్లోనే ఇంటి లెక్కలూ.. పుత్రరత్నం తన బుర్ర పగలేసిన 'వైనం' వివిధ స్థాయిల్లో చెబుతూ కేకలకు తగులుకున్నాడు.

"అవుర్నా.. అప్పులు చేసిన.. ఎక్కడబడితే అక్కడ... ఎవడిస్తనంటే వాడి దగ్గర్నుండి అప్పుదెచ్చిన! చాలానే దెచ్చిన.. దమ్ములుంటే వీడ్నీ తెమ్మను.. తెమ్మన్రా.. (రొమ్ములు లపలపబాదుకున్నాడు) చాతకావాలె.. అహ్హా.. (మెటికలు విరిచాడు) పైస పుట్టియ్యడం చాతకాని వాళ్ళందరు నన్ను తప్పుబట్టెటోళ్ళే! ఇపుడు మరి ఆ అప్పులన్నీ గీ పెండ్లికొడుకు తీర్వాలె! తప్పుతాది!"



యాద్గిరి ఒడుపుగా ముసిలోడి పట్టునుండి బయటపడి మెడ సవరించుకుని బుర్ర గోక్కున్నాడు!

"ఏం చేసిన? అడగవేం? సుట్టాలొస్తే యాటలుకోసి... కోళ్ళు కాపి.. బట్టలు పెట్టి పోటోలు దింపించి పంపిన! తప్పుద్దా! మిద్దె కర్రలకు నాణ్యమైన రంగులేయించిన! దొడ్లో పూలచెట్లు పెంచిన! రెండు కలర్ టీవీలు దెచ్చిన... ముత్యాలమ్మ.. మరిడెమ్మ.. మారెమ్మ.. మాంకాళి పండగలు జేసిన.. ఊరు ఊరంతటిని పిలిసిన.. వీడికింత దమ్ముందా? కానీ.. ధు... అప్పుచెయ్యడం చాతకానోడు ఇంగ పెండ్లాన్ని సాదినట్లె.. పిల్లల్ని గన్నట్లె!"

బయట వెంకట్రాం మరో దుడ్డుకర్రందుకుని శివతాండవానికి తగులుకున్నాడు.

"ఓర్నీ ముసలోడ.. ఈ ఇల్లు మొత్తానికి మొత్తం అంతా అమ్మి పారనూకినా వడ్డీలకు సరిపోవుగదరా! నీ వడ్డీలకునా.. సుట్టాలు.. పోటోలు... సంబరాలు.. గిపుడు బువ్వకూడ గతిలేదుగాదుర.. చిప్ప.. చిప్ప..!"

* * *

రావిచెట్టు కింద జక్కులోడు.. యాద్గిరి వాదనలుపడి జుట్లు పట్టుకునే దాకా వచ్చారు.

"అవును.. ఆ ముసిలోడు అప్పులు చేసిండు.. తప్పా? అంత అప్పుతేవడమంటే మాటలా మరి!" యాద్గిరి కసిరాడు.

"యహె.. మన చంద్రబాబుగారు మాట్లాడినట్లు మాట్లాడితే నాకు కింద కాలతది! అసలది తీరే సంగతింకా తేలడంలేదు. మళ్ళీ అప్పులు.. మనల్ని మనం అమ్ముకున్నా గా వడ్డీలకే సరిపోదు - గదేం సంబడం!" జక్కులోడు మాంచి మెలికేశాడు!

"సర్సరే.. ఈ అప్పులూ.. వడ్డీలూ చూసి గుండె గుభేల్మని వెంకట్రాముడు వాడి అయ్య బుర్ర రాంకీర్తన పాడించాడు. వాడేమో పరమ ఛండాలంగా రక్తం కార్చుకుంటూ బూతులకు తగులుకుని, ఇంకా 'అప్పులే నాగొప్పల'ని బీరాలు పోతున్నాడాయె! 'అప్పులు తెస్తివా - చస్తివే' అని వెంకట్రాంగా గోలాయె! బాగానే వుంది. మరి మన బాబుగారు కూడా అట్లానే అప్పులకు తగులుకున్నాడు గదా.. కుటుంబానికో యాభైవేల్దాకా అప్పు అందించె! వడ్డీ భయంకరం.. షరతులు చండాలం... మరి ఈ మతలబు తేలేదెట్లా?" మల్లేశు గుబులుగా జుట్టుపీక్కుంటూ అన్నాడు.

"ఒరే.. ఈ సంగతిలో మనవేగాక మంత్రులందరు కూడా ఆలోచన్లు చేసి చాలా గుబులు పడతండ్రు - వాళ్ళేగాని ముందు ముందు రోజుల్లో జనాల మధ్యకుగానీ వస్తే ఇదే గతి పడుతుందేమోనని హడలి చస్తున్నారు కూడా..."

"ఏం లాభం.. వాళ్ళ భయం లోలోపల్నే పెరిగిపోతే ప్రమాదం గద? గుండెలాగి ఛస్తారేమో.. అసలే ప్రపంచ బ్యాంకు.. అడ్డీకి పావుసేరు.. హమ్మో..!"

"ఒరే.. అందుకేరా వాండ్లందరి బుర్రలూ ఆర్డర్లో వుండి ఆందోళన పడకుండా వుండడానికే మెగా యోగాసనాలు.. రిలాక్స్.. రిలాక్స్ కాసెట్లు.. మానసిక శాంతి పుస్తకాలు.. హన్నా.. వాళ్ళందరూ గవి పెట్టుకుని బాధను.. కోపాన్ని లోలోపలే అణుచుకుంటారన్నమాట! ప్లాను చాలా బాగుందిగాదుర.. రెండు కాళ్ళు బారజాపి పండుకున్న వాడికి ఎన్ని అప్పులైతే ఏం లెఖ్ఖ! ఎవడెక్కడ మిడికి చస్తే ఏం జమా?"

ఈ ఆలోచనతో అక్కడున్న అందరూ చల్లబడి చప్టామీద కూలబడ్డారు!

"ఒరే ముసిలోడి బుర్రకాయను వెంకట్రాముడు పగలేసినట్లు - వీళ్ళూ అదే టెన్షనులో వుండి తన బుర్రకాయకు ఎక్కడ ఎసరు పెడతారోనని బాబుగారు భలే పన్నాగం పన్నాడు గదరా..!" వాళ్ళుగాకపోతే జనం...

జక్కులోడి మాటలకు అందరూ ఆలోచనలో పడ్డారు! ★

గుప్తా కల నిజమైంది

-సుమేరా ఫిర్దోస్



అభినవ్ శ్యాం గుప్తా

ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ పి.గోపీచంద్ చేతి మణికట్టు గాయం అభినవ్ శ్యామ్ గుప్తాకు వరంగా మారింది. టాప్ సీడ్ చేతన్ ఆనంద్ రౌండ్ రాబిన్ లీగ్ పోటీల్లోనే ఇంటిముఖం పట్టాడు. దీంతో జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకోవాలని గుప్తా ఎంతో కాలంగా కన్న కలలు దీంతో సాకారమయ్యాయి. అలహాబాద్‌కు చెందిన రెండోసీడ్ ఆటగాడు గుప్తా విజేతగా నిలవడానికి గల అడ్డంకులన్నీ తొలగిపోవడంతో అతని గెలుపు నల్లేరుమీద నడకగా మారింది. గుప్తాకు ఈ టైటిల్ సాధించే అవకాశం గతంలో రెండుసార్లు లభించినప్పటికీ వినియోగించు కోలేకపోయాడు. ఈసారి ప్రారంభంలో ఒడిదుడుకులకు లోనైనప్పటికీ చివరికి గట్టిగా నిలిచి ట్రోఫీ హస్తగతం చేసుకున్నాడు. ముఖ్యంగా అతని రెండు సంచలనాత్మక విజయాలు జాతీయ ఛాంపియన్‌గా నిలబెట్టాయి.

అపర్ణ పోపట్ వరుసగా నాలుగోసారి ఈ టైటిల్ హస్తగతం చేసుకుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో మార్కోస్ బ్రిస్టోవ్, మధుమిత బిస్త్ 25వ సారి తలపడి 12వ సారి విజేతగా నిలవడం విశేషం. పురుషుల డబుల్స్‌లో సనవే థామస్, వి.డిజుల జోడీ, మహిళా డబుల్స్‌లో నీలిమ చౌదరి, డి. స్వేతల జంట జాతీయ ఛాంపియన్‌గా తొలిసారి నిలిచారు.

అయితే ఈ టోర్నీలో అభినవ్ మాత్రమే అందరి దృష్టిని ఆకర్షించాడు. కీలక మ్యాచ్‌లలో తొలుత వెనకబడిన అభినవ్ తర్వాత పుంజుకొని విజయం సాధించడం వల్లే అభిమానులు అతనికి బ్రహ్మరథం పట్టారు. నిఖిల్ కనిత్కర్‌తో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో, అరవింద్ భట్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నిర్ణయాత్మక గేమ్‌లో 4-6తో వెనకబడిన అభినవ్ తర్వాత పుంజుకొని విజయం సాధించడం అతని పట్టుదలకు నిదర్శనం. మ్యాచ్ తన చేతుల నుండి జారిపోతున్న తరుణంలో పోరాడి ఆ మ్యాచ్‌ను తనవైపుకు తిప్పుకోగలగడం అతనికే చెల్లింది. ఈ ఛాంపియన్‌షిప్‌లో అతనికి చాలా విజ యాలు నాటకీయంగానే లభించాయి. "ఫైనల్లో అదృష్ట వశాత్తే నాకు విజయం లభించింది. నా చిరకాల కల నిజమైంది. ఈ టోర్నీలో ఆడనందుకు గోపీచంద్‌కు కృత జ్ఞతలు చెప్పుకోవాలి" అని గుప్తా ట్రోఫీ అందుకున్న తర్వాత అన్నాడు. గోపీచంద్ డిసెంబర్‌లో కోపెన్ హాగెన్ మాస్టర్స్ టోర్నమెంట్‌కు మిల్టన్ కెయిన్స్‌లో సన్నద్ధమవుతుండగా గాయపడ్డాడు. దీంతో అతను ఈ టోర్నీలో ఆడలేక పోయాడు. నిర్వాహకుల వినతి మేరకు గుప్తా, కనిత్కర్ మధ్య పాటియాలాలో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌ను గోపీ తిలకించాడు. "ఈ మ్యాచ్‌లో మంచి ఫలితం వచ్చింది. అయితే మ్యాచ్ క్వాలిటీ ఇంకా పెరిగితే బాగుండేది" అని గోపీ అభిప్రాయపడ్డాడు. ఎడమచేతి ఆటగాడు కనిత్కర్‌తో జరిగిన మ్యాచ్‌లో నిర్ణయాత్మక చివరి గేమ్‌లో గుప్తా అదృష్టం వల్లే గెలుపొందాడు. మరుసటి రోజు జరిగిన ఫైనల్లో నిర్ణయాత్మక చివరి గేమ్‌లో భట్ ఒక దశలో 5-1తో ఆధిక్యంలో ఉన్నాడు. ఈ దశలో గుప్తా తన మ్యాజిక్ ఆటను ప్రదర్శించి వెనువెంటనే రెండు పాయింట్లు సంపాదించాడు. మూడోపాయింటు తన చేయి దాటగానే కనిత్కర్ మైదానంలో కుప్పకూలాడు. అయినా గుప్తా కనికరించకుండా మరో పాయింటు సాధించి ఛాంపియన్‌గా నిలిచాడు. టాప్‌సీడ్ చేతన్ ఆనంద్ క్వార్టర్ ఫైనల్లో వారణాసీకి చెందిన రవీందర్ సింగ్ చేతిలో అనూ హ్య ఓటమి పాలైనప్పుడే గుప్తాకు టైటిల్ గ్యారంటీ అయిం ది. చేతన్ నాలుగో గేమ్‌లో చేసిన తప్పిదాలనే మళ్ళీ మళ్ళీ చేస్తూ ఓటమిని చేతులారా కొని తెచ్చుకున్నాడు.

అపర్ణ గెలుపు నల్లేరుపై నడక

ఎదురు లేని అపర్ణ పోపట్

మహిళా విభాగంలో అపర్ణ పోపట్ గెలుపు నల్లేరు మీద నడకగా సాగింది. అపర్ణ తన జైత్రయాత్రలో ఒక్కరి నుండి కూడా గట్టిపోటీని ఎదుర్కోలేదు. గట్టి పోటీ ఇస్తుందని పరిశీలకులు భావించిన మంజూషా కన్వర్ మోకాలు నొప్పి కారణంగా బరి నుండి వైదొలగడం అపర్ణకు వరంగా మారింది. సి. హెచ్. దీప్తితో జరిగిన సెమీస్‌లో ఆమె విజయానికి కాస్త శ్రమించాల్సి వచ్చింది. రెండోసీడ్, రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన పి.వి.వి. లక్ష్మీని సెమీస్‌లో కంగుతినిపించిన తృప్తి ముర్గుండేను ఓడించడం అపర్ణకు పెద్ద లెక్కకాలేదు. అపర్ణకు ట్రోఫీతో పాటు 80 వేల రూపాయలు లభించగా, రన్నరప్‌గా నిలిచిన తృప్తి 40 వేల రూపాయలు సొంతం చేసుకుంది. మహిళా సెమీస్‌లో తొలి నాలుగు ర్యాంకు క్రీడాకారిణులే ప్రవేశించడం వారి ప్రతిభకు నిదర్శనం. అయితే దివ్యరమేశ్ అన్‌సీడెడ్ శ్రీలక్ష్మి చేతిలో అనూహ్యంగా ఓడిపోవడం మహిళా విభాగంలో సంచలన మ్యాచ్‌గా నిలిచింది. ప్రపంచ కప్‌లో పాల్గొనే భారత జట్టులో స్థానానికై దివ్య కోర్టుకు వెళ్ళింది. అయితే ఇక్కడ మాత్రం ఒక జూనియర్ బాలిక చేతిలో ఓడిపోవడం గమనార్హం.

మిక్స్‌డ్ డబుల్స్ ఫలితం ప్రత్యేకతగా నిలిచింది. ఎనిమిది సింగిల్స్, తొమ్మిది డబుల్స్, 12 మిక్స్‌డ్ డబుల్స్ టైటిళ్ళు సాధించిన మధుమిత ఈ టోర్నీలో చివరిసారిగా పాల్గొన్నది. తన చివరి గేమ్‌లో టైటిల్ సాధించాలనుకున్న మధుమిత అనుకున్నది సాధించింది. "చివరి గేమ్‌లో టైటిల్ సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది" అని 37 ఏళ్ళ మధుమిత చెప్పింది. ఆమె నార్తర్న్ రైల్వేస్‌లో స్పోర్ట్స్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తోంది. బ్రిస్టోవ్‌తో జతకూడిన మధుమిత ఫైనల్లో డిజు, ఫాతిమా జంటను మట్టికరిపించింది. మధుమిత ఈ వయస్సులో జాతీయ టైటిల్ సాధించడం నిజంగా విశేషమే! మధు రిటైర్ అవుతున్నప్పటికీ ఆమె విజయ దాహం ఇంకా తీరలేదనే చెప్పాలి. ఎవర్‌గ్రీన్ ఛాంపియన్ అయిన మధుమిత పట్టుదల నేటి తరం ఆటగాళ్ళలో కొరవడింది. పురుషుల డబుల్స్‌లో తొలిసారి టైటిల్ సాధించిన సనావె థామస్, వి.డిజుల జోడీ వెటరన్ క్రీడాకారులకు హెచ్చరిక జారీ చేశారు. వీరు ఫైనల్లో టాప్‌సీడ్ జోడీ జసీల్ పి. ఇస్మాయిల్, జైసన్ గ్జేవియర్‌ను కంగుతినిపించడం విశేషం. డబుల్స్ విభాగంలో కేరళ ఆధిపత్యం కొనసాగనుందని ఈ ఫలితం నిరూపించింది. నీలిమ, స్వేతల జోడీ అందరికంటే ఎక్కువ ఆశ్చర్యం కలిగించింది. లీగ్ పోటీల్లో చాలాసార్లు ఓటమి కోరల్లోనుండి తృటిలో బయటపడ్డ ఈ జోడీ ఫైనల్లో అనుభవజ్ఞులైన ఫాతిమా నాజ్నీన్, సి. హెచ్. దీప్తిల జంటను కంగుతినిపించడం విశేషం. ★

కథ

మొలకలపల్లి కోటేశ్వరరావు

పెను తుపాను

"మీరు కంపెనీకి వెళ్తారు. నాకు ఒక్కదానికీ ఇంటి దగ్గర ఏం తోచక బోర్‌గా వుంటుంది. టీవీ తీసుకురండి. నాకు కాలక్షేపమవుతుంది. టీవీ కోసం ఇరుగింటికీ, పొరుగింటికీ వెళ్ళడం ఏం బాగుంటుందండీ? పైగా యిది సిటీ. ఎవరి జాబ్స్‌లో వాళ్ళు బిజీగా వుంటారు!" అంది ఉమ భర్త రాజారావుతో.

మూడు నెలల నుంచీ ఉమ రోజూ ఒక్కసారైనా భర్తకి టీవీ విషయం గుర్తు చేస్తూనే వుంది కొనమని.

ఉమకి కుటుంబానికి అవసరమైన వస్తువులు ఒక్కొక్కటి నెమ్మది నెమ్మదిగా అమర్చుకుందామని కోరిక. ఉమ కోరగా, పోరగా మిక్సీ ఒకటి ఏర్పడింది.

"తొందరపడకు ఉమా.. తెస్తాను కదా! బ్లాక్ అండ్ వైట్ కాదు, ఒకేసారి కలర్ టీవీనే తెస్తాను. కొనుక్కునేది ఏదో ఒకేసారి మంచిది చూసే కొనుక్కోవాలి. మాటిమాటికీ కొనుక్కునే వస్తువు కాదు గదా టీవీ అంటే! ఇప్పుడు కలర్ టీవీ ధరలు కూడా బాగా తగ్గిపోయాయట. మనం కలర్ టీవీనే కొనుక్కుందాం!"

"ఏదో ఒకటి. మూడు నెలల నుంచీ తెస్తానని అంటున్నారు కానీ అసలు ఆ ప్రయత్నంలోనే లేరు. ఎప్పుడండీ మీరు టీవీ తెచ్చేదీ, నేను చూసేదీ?"

"పరిస్థితి నీకు తెల్సు కదా ఉమా... నాకు వచ్చేది మూడున్నర వేలు. ఇందులోనే ఇంటద్దె, బస్ పాసూ..."

"మీ సిగరెట్లూ, సినిమాలూ... ముందు మీరు సిగరెట్లు తగలెయ్యడం తగ్గించండి. మింగవెతుకులేకపోయినా మీసాలకి సంపంగి నూనె కావాలన్నాడట వీలాంటి ఒకడు!"

"అబ్బో... సామెతలు కూడా నేర్చావే!"

"లేకపోతే ఏంటండీ? రోజుకు 15, 20 రూపాయలు మీరు సిగరెట్లకి తగలేస్తున్నారు. ఎందుకండీ అవి గబ్బు కొట్టుకుంటూ! ఇంటికీ, వంటికీ రెంటికీ అవి మంచిదికాదు. డబ్బు పోవడమేగాక అనారోగ్యం కూడా! అలాగే సినిమాలకీ, షికార్లకీ నెలకి మూడు నాలుగు వందలు ఖర్చుపెడుతున్నారు. మీరు మూడు నెలలు పెట్టే ఖర్చుకు మనకి బ్లాక్ అండ్ వైట్ టీవీ వచ్చేది!"

"నిజమే ఉమా... చిన్నప్పట్నించీ వచ్చిన అలవాటుని మనుకోవాలంటే..."

"ఏమిటీ? చిన్నప్పట్నించీ మీకు ఈ అలవాటు వుందా?" ఆశ్చర్యం అభినయిస్తూ అడిగింది ఉమ.

"మరి?" ఉమ ధోరణికి అయోమయంగా అడిగాడు రాజారావు.

"చిన్నప్పట్నించీ అంటే... మీరు పుట్టుకతోనే సిగరెట్లు తాగుతూ పుట్టేరన్నమాట!"

"మరీ అంత చిన్నప్పట్నించి కాదులే. పదో తరగతి పూర్తి కావడం ఈ అలవాటు మొదలుకావడం ఒకేసారి జరిగింది."

"మనకి యింకా పిల్లాపీచూ లేరు. ఇప్పుడే ఎంతో కొంత మిగుల్చుకుని అవసరమైన వస్తువులు ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందండీ! ముందుముందు ఖర్చులు పెరుగుతాయి కానీ తగ్గవు!"

"నేను కాదన్నానా?"

"మీరు నోటితో కాదనలేదు కానీ చేతల్లో మాత్రం కాదన్నట్లుగానే చేస్తున్నారు. మీ వలనే కదా సమస్య! ముందు మీరు ఈ దుబారా ఖర్చుల్ని వదిలెయ్యండి. డబ్బు ఎలా మిగలదో చూద్దాం.!"

"ఎప్పట్నించో వస్తున్న అలవాట్లని ఒక్కసారిగా మానుకోవాలంటే ఇబ్బంది ఉమా!"

"ఒక్కసారిగా మానుకొమ్మని నేను అన్నానా? నెమ్మదిగానే మానుకునేందుకు ప్రయత్నించండి. ముందు మీకు మానుకోవాలనే ఆలోచన రావాలి కదా! ఆలోచన వచ్చిన తరువాత ఫలానా టయానికి మానుకోగలను అని ప్లాన్ చేసుకుని, ఆ ప్లాన్‌ను అమలు పరచండి!"

"అలాగే ఉమా! ఈ నెలాఖరులోవు మానుకుంటాను చూడు. ఇప్పుడు ప్యాకెట్ కదా! రోజుకి ఒకటి చొప్పున తగ్గించుకుంటూ వస్తాను. నెలాఖరు వరకూ కూడా పన్లేదు. పదిరోజుల్లోనే పొగకి.. పొగపెట్టకపోతే అడుగు!"అన్నాడు రాజారావు.

* * *

రాజారావు ఐ.టి.ఐ. చదువుకున్నాడు. స్వంతవూళ్ళో కుటుంబానికి రెండు ఎకరాల పొలం వుంది. ముగ్గురు అన్నలు వున్నారు. తల్లిదండ్రులకు రాజారావు చిన్న కొడుకు. వాళ్ళు కూలి పనులు చేసుకుంటూ కష్టపడి కొడుకును ఐ.టి.ఐ. వరకూ చదివించారు.

ఐ.టి.ఐ. పాసయిన తరువాత రాజారావుకు చాలాకాలం వరకూ ఉద్యోగం రాలేదు. నలుగురు అన్నదమ్ములకీ పొలంలో చేయడానికి సరిపడినంత పని వుండేది కాదు.

రాజారావు కూలి పనులకు వెళ్ళడానికి సిద్ధమైనా ఆ గ్రామంలో కూలి పనులు కూడా దొరికే అవకాశం చాలా తక్కువ.

ఒకవేళ కూలి పని దొరికి వెళ్ళినా రాజారావు గట్టిగా, ధమాయించి పనిచేసే వాడు కాదు.

ఉద్యోగం లేదు. పని చేతకాదు. చేయలేదు. అన్నలూ, తల్లిదండ్రులూ పనికి బాధ్యుడు కాదు అని తిడుతూ వుండేవాళ్ళు.

ఇలాంటి స్థితిలో మూలిగే నక్కమీద తాటికాయ పడినట్లు ఏడేళ్ళ క్రితం తుపాను వచ్చింది.

...ళ్ళో చాలామంది ఇళ్ళు కోల్పోవడంతో పాటు చాలా నష్టపోయారు. రాజారావు వాళ్ల ఇల్లు కూడా కూలిపోయింది. తుపాను కారణంగా నీళ్ళు నిలిచి పొలంలో పంట కూడా పూర్తిగా దెబ్బతిని పోయింది. రాజారావు వాళ్ళ కుటుంబం కోలుకోలేని విధంగా నష్టపోయింది.

ఊళ్ళో వుంటే ముందు కాలంలో తన పరిస్థితి దుర్భరమై పోతుందనే విషయం రాజారావుకి అర్థమైపోయింది. తండ్రిని అడిగి కొంత డబ్బు తీసుకుని రాజధాని నగరం చేరుకున్నాడు.

ఊరివాళ్ళు కొందరు రూం తీసుకుని వుంటే రాజారావు కూడా ఆ రూంలో చేరాడు. తండ్రి ఇచ్చిన స్వల్ప మొత్తం డబ్బు కొద్ది రోజుల్లోనే అయిపోయింది.

అతికష్టం మీద రాజారావు చాలా తక్కువ జీతానికి వాచీలు తయారు చేసే కంపెనీలో చేరాడు. తన చదువుకీ, ఉద్యోగానికీ ఏమీ సంబంధం లేదు. వాచీల విడిభాగాలు కొని అసెంబ్లింగ్ చేసి అమ్మకం జరిపే కంపెనీ అది. అసెంబ్లింగ్ చేసి వాచీల్ని కంపెనీ పేరుతోనే అమ్మకాలు జరిపేది. ఆ కంపెనీ వాచీలకి మంచి డిమాండ్ కూడా వుంది.

చేరిన మొదట్లో రాజారావుకి 350 రూపాయల జీతం ఇచ్చే వాళ్ళు. కంపెనీలో కష్టపడి పని చేయడం అలవాటు చేసుకున్నాడు.

కష్టపడటం, నమ్మకంగా చేయడంతో మేనేజ్‌మెంట్ క్రమక్రమంగా జీతం పెంచింది. ఇప్పుడు రాజారావు నెలకి మూడున్నర వేల జీతం సంపాదిస్తున్నాడు.

తొమ్మిది నెలల క్రితం కొద్దిపాటి కట్నంతో ఉమతో పెళ్ళి జరిగింది. పెళ్ళయిన నెల రోజులకే భార్యా సమేతంగా నగరంలో కాపురం పెట్టాడు.

వారం రోజులు జరిగిపోయాయి.

కంపెనీలో పని చేసి నీరసంగానూ, ఉసూరుమంటూ వచ్చే రాజారావు ఉత్సాహంగా ఇంట్లోకి అడుగు పెట్టాడు.

"కాసిని టీ వుంటే యివ్వు ఉమా.. టీ తాగుతూ గుడ్‌న్యూస్ చెబుతాను!"

"ఏమిటో?" అంటూ ఉమ చకచకా లోపలికి వెళ్ళి టీ తయారుచేసి తెచ్చి యిచ్చింది.

"మనకి వచ్చే నెల ఒకటో తేదీ బ్రహ్మాండమైన కలర్ టీవీ వస్తోంది!"

"నిజమా?" ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ అడిగింది ఉమ.

"ఒక్క కలర్ టీవీ ఏమిటీ? అన్ని వస్తువులూ ఆర్నెల్లు తిరిగేసరికి మన ఇంట్లో అమరి ఉంటాయి. ఇక సిగరెట్లు తాగడం కానీ ఏమీ చేయను. నెలనెలా వెయ్యి మిగిల్చి ఒక్కో వస్తువు కొని పడేస్తాను!"

"వెయ్యి రూపాయలకి ఏమొస్తాయండీ?"

"కలర్ టీవీ ఎంతనుకుంటున్నావు? మూడు వేలు. నిజం ఉమా.... చైనా దేశం నుంచి విపరీతంగా మన దేశానికి వచ్చి పడుతున్నాయట చాలా రకాల వస్తువులు, రేడియోలు, వాచీలూ, ఎక్ట్రానిక్ బొమ్మలూ, సెల్లులూ, క్రీములూ, పేస్టులూ, ఫోన్లూ, కలర్ టీవీలూ, మోటార్ సైకిళ్ళూ... అన్నీ బేగం బజార్‌లో అమ్ముతున్నారంట. మా ఆఫీసులో చాలా మంది రేడియోలు, ఎలక్ట్రానిక్ బొమ్మలూ కొనుక్కువచ్చారు. చాలా మంచి క్వాలిటీ. చాలా చీప్ కూడా అంట! మా కంపెనీలో ఎవర్ని కదిలించినా నిన్నా, ఇవ్వాళా ఇదే విషయం అనుకో! నిన్న నీకు చెప్పటం మరిచాను!"

"అయితే మనం వెంటనే కలర్ టీవీ తెద్దామండీ!"

"అలాగే! ఇంతకుముందు వెయ్యి వున్నాయి. వచ్చే నెల ఒక వెయ్యి మా కంపెనీలో ఒకదు చేబదులు ఇస్తానన్నాడు. ఒకటో తేదీ జీతం అందుకున్న తరువాత ఆ రోజు సాయంత్రం టీవీ తెచ్చుకుందాం!'

ఆ రోజు ఐదో తేదీనే! వచ్చే నెల ఎప్పుడు వస్తుందా, ఎప్పుడు వస్తుందా అని ఉమ, రాజారావు రోజులు లెక్కపెట్టుకుంటూ ఎదురు చూడటం మొదలు పెట్టారు. కంపెనీలో పని చేసే కొలీగ్ జీతాలు తీసుకునే రోజు చేబదులు ఇస్తానని చెప్పిన విషయం అతనికి మధ్యలో రెండుసార్లు గుర్తు చేశాడు రాజారావు.

ఒకటో తేదీ వచ్చింది.

"ఉమా... సాయంత్రం రెడీగా వుండు. పర్మిషన్ తీసుకుని ఒక గంట ముందు వస్తాను. బేగం బజారుకి వెళ్ళి టీవీ తెద్దాం!" అని భార్యకి చెప్పి కంపెనీకి వెళ్ళాడు రాజారావు.

ఉమ మధ్యాహ్నం నుంచే నీట్‌గా ముస్తాబై భర్త కోసం ఎదురు చూస్తోంది.

"ఉదయం హుషారుగా వెళ్ళిన రాజారావు సాయంత్రం ఉసూరుమంటూ ఇంటికి చేరాడు.

"ఏంటండీ అలా వున్నారు? బాగా లేదా ఏమిటి?" ఆందోళనగా అడిగింది ఉమ, రాజారావు వాలకం చూసి.

"ఇవ్వాళ జీతాలు ఇవ్వలేదు ఉమా..." నీరసంగా, బిడియపడుతూ ఉమని నిరుత్సాహ పరుస్తున్నాననే బాధతో మెల్లగా చెప్పాడు రాజారావు.

"ఎందుకండీ, ఎందుకు ఇవ్వలేదు?"

"ఏమో మరి... చెప్పలేదు. ఇప్పటికి చేరి ఎనిమిదేళ్ళు. ఇంతవరకూ ఇలా ఒక్కసారి కూడా జరగలేదు. జీతం తక్కువ అయినా ప్రతి నెలా ఠంచన్‌గా ఒకటో తేదీ పేమెంట్ వుండేది. ఒకటో తేదీ హాలిడే అయితే అంతకుముందు రోజే ఇచ్చే వాళ్ళు కానీ ఆపే వాళ్ళు కాదు. ఈ నెల ఎందుకు ఇలా జరిగిందో తెలియదు!"

"సరే బాధపడకండి. ఇవ్వాళ కాకపోతే రేపైనా ఇస్తారు కదా! ఇచ్చిన రోజే తెచ్చుకుందాం. దానికోసం ఎందుకు ఇంత బాధపడటం?" అని ఉమ భర్తను ఓదారుస్తూ, పూరడిస్తూ మాట్లాడింది.

కంపెనీ వాళ్ళు ఎనిమిదో తేదీన జీతాలు ఇచ్చారు. అప్పటికే కొన్ని అప్పులు చేశాడు రాజారావు. జీతం అందుకుని తీసుకున్న అప్పులు మొత్తం తీర్చేసాడు.

ప్రస్తుతం టీవీ తెచ్చే ఆలోచనని వాయిదా వేసుకోవడంతో చేబదులు ఇస్తానని చెప్పిన మిత్రుడ్ని కూడా ఇక అడగలేదు.

తరువాత నెల జీతం కూడా అలాగే వాయిదావేసి, కొంత ఆలస్యంగా ఇచ్చారు.

"ఇలా ఆలస్యంగా జీతాలు ఇస్తే ఎలాగండీ?"ఉమ ఆందోళనగా అడిగింది.

"మనం ఏం చెయగలం ఉమా? కంపెనీ ప్రోడక్ట్స్‌కి సేల్స్ లేదట. బాగా నష్టాల్లో కూరుకుపోయింది కంపెనీ. చైనా దేశం నించి చాలా చీప్‌గా వాచీలు రావడంతో మా కంపెనీ వాచీల్ని కొనేవాడు లేకుండా పోయాడు. ఎవరి చేతికి చూసినా ఇవ్వాళ చైనా వాచీయే! ధర తగ్గించి ఇస్తే కంపెనీకి గిట్టుబాటు కాదు. బహుశా కొద్ది రోజుల్లో కంపెనీ మూసివేసినా ఆశ్చర్యపోవాల్సిన పని లేదు!" అన్నాడు రాజారావు దిగులుగా.

ఒకవైపు ఉద్యోగం చేస్తూనే ఇతర కంపెనీలలో ఉద్యోగం కోసం బాగా ప్రయత్నించాడు రాజారావు. చాలా రకాల ఉత్పత్తులు చేసే కంపెనీలు మూసివేసి దర్శనమిచ్చాయి. మూసివేయకుండా ప్రస్తుతం పనిచేస్తున్న కొద్ది కంపెనీల్లో ఎలాంటి అవకాశం దొరకలేదు.

రాజారావూ, తోటి వుద్యోగులూ భావించినట్లుగానే కొంతకాలంలోనే కంపెనీ మూతపడింది. అందులో పని చేసే 140 మంది ఉద్యోగాలూ వూడిపోయాయి.

కంపెనీ ప్రొప్రయిటర్ కనపడలేదు. వీళ్ళకి ఎలాంటి జవాబు, హామీ, పూచీ ఏమీ లేకుండానే కంపెనీ మూసివేశారు.

చైనా వస్తువులూ, ఇతర విదేశీ వస్తువులూ చౌకగా వస్తాయని రాజారావు వాళ్ళు కలలు కన్నారు. కానీ చౌకగా వచ్చే ఆ వస్తువులు కూడా కొనే పరిస్థితి వుండదని తెలుసుకున్నాడు రాజారావు. అంతేగాకుండా అవే తమ నోటి మీదా, కడుపు మీదా కొడతాయని ఆలస్యంగా గ్రహించాడు.

నగరంలోనే వుంటూ ఏదో ఒక కంపెనీలో ఏదో ఒక ఉద్యోగం కోసం చాలా ప్రయత్నించాడు. అన్ని చోట్లా నిరాశే ఎదురయింది.

ఒకవైపు ఇంటద్దె, కంపెనీల చుట్టూ తిరుగుతున్నందుకు బస్‌ఛార్జీలూ, ఇంటి ఖర్చులూ పెరిగిపోయాయి.

అద్దెకి ఆటో తీసుకుని తిప్పుకుని కుటుంబాన్ని జరుపుదామనుకున్నాడు. కానీ విపరీతమైన ట్రాఫిక్‌లో ప్రమాదాలు గుర్తొచ్చి, అది తనకి సాధ్యమయ్యే పని కాదని గ్రహించాడు.

"ఊళ్ళో తుపాను కారణంగా దెబ్బతిని నగరానికి వచ్చాను ఉమా! ఇప్పుడు అంతకంటే పెద్ద తుపానే వచ్చింది. ఈ తుపాను కారణంగా ఎంతమంది జీవితాలు అస్తవ్యస్తమై వీధిన పడి అల్లాడిపోతున్నాయో లెక్కలేదు. ఇక ఇక్కడ మనం చేయగలిగింది లేదు. ఊరికి పోయి, అక్కడే కూలీ నాలీ చేసుకునో, పస్తులు పడుకునో, మన వాళ్ళ మధ్య మనం బతుకుదాం!" అన్నాడు రాజారావు.

చేసిన అప్పులకి మిక్సీతోసహా ఉన్న చిన్నానాలుగు వస్తువులూ అమ్ముకుని స్వంతగడ్డకు చేరుకున్నారు ఆ దంపతులు.

★

అమరవీరుని పోరాటగాథ

సింగరేణి బొగ్గుగని కార్మికోద్యమ చరిత్ర గురించి ఏ మాత్రం తెలిసిన వారికైనా ముందుగా స్ఫురించే పేరు శేషగిరి. శేషగిరి జన్మస్థలం నెల్లూరు జిల్లాకు చెందిన దేవూరు. తన సోదరి, సోదరుడు బ్రతుకు తెరువు కోసం కొత్త గూడెంలో స్థిరపడగా 1940వ దశకం ఆరంభంలో శేషగిరి కూడా వారిని చేరుకుంటాడు. ఇంటర్మీడియెట్ వరకు చెన్నపట్నంలో చదివిన శేషగిరి అప్పటికే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నాడు. కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలు ఏర్పరుచుకున్నాడు. రాజకీయాలకు దూరంగా ఉంచేందుకే తండ్రిగారు ఆయనను కొత్తగూడెం పంపారు. కాని ఆనాటి నిజాం హయాంలో తెల్లవారి పర్యవేక్షణలో నడుస్తున్న బొగ్గుగనుల్లోని కార్మికుల దుర్భర పరిస్థితి శేషగిరిని కదిలించి వేసింది. ముఖ్యంగా కాంట్రాక్టర్ల క్రింద పని చేసే రోజువారీ కార్మికుల పరిస్థితి అతి హీనంగా ఉండేది. నల్లజాతి బానిసల మాదిరిగా వారిని శారీరకంగా హింసించి బలవంతంగా పని చేయించేవారు.

పేజీలు : 265; **వెల :** రూ. 80/–;
ప్రతులకు : విజేత పబ్లికేషన్స్, లక్ష్మీనగర్, గోదావరిఖని, కరీంనగర్ జిల్లా.

చాలీచాలని కూలి, అప్పుల చక్రబంధాల మధ్య కట్టు బానిసల్లా పడి ఉండేవారు. పర్మినెంటు కార్మికుల పరిస్థితి సైతం ఏమంత మెరుగ్గా ఉండేది కాదు. అదనపు శ్రమ కోసం పీల్చి పిప్పి చేయబడేవారు. ఇలాంటి దుర్భర పరిస్థితిలో ఉన్న గని కార్మికులను గమనించిన శేషగిరి వారిని సమీకరించి, దోపిడీకి వ్యతిరేకంగా నిలబెట్టడం ఎలా అన్న దాని గురించే ఆలోచించేవాడు. అదే సమయంలో ఆయన సింగరేణిలో ఉద్యోగిగా చేరడం కూడా తటస్థించింది. ఈ అవకాశాన్ని ఆయన కార్మికుల స్థితిగతులను మరింత నిశితంగా పరిశీలించడానికి, వారి తరఫున యాజమాన్యాన్ని నిలదీయడానికి ఉపయోగించుకున్నాడు. అప్పటికే రాజకీయాలతో పరిచయముండి సింగరేణిలో ఉద్యోగులుగావున్న పర్సా సత్యనారాయణ, చలపతి లాంటి వారితో పాటు మిలిటెంట్‌గా ఉండే కార్మికులు కొందరు చేదోడు వాదోడుగా నిలిచారు. వరంగల్ జిల్లా అజంజాహి మిల్లులో యూనియన్‌ను స్థాపించి నడుపుతున్న కమ్యూనిస్టు నాయకుడు సర్వదేవభట్ల రామనాథం ఆయనకు సలహాలు, సంప్రదింపులు అందించారు. తెలంగాణా అంతటా జరుగుతున్న నిజాం వ్యతిరేక రైతాంగ సాయుధ పోరాటం గురించి కార్మికులకు వివరించి వారూ అందులో పాలు పంచుకోవాలని శేషగిరి ఉద్బోధించేవారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన సింగరేణి కార్మికోద్యమం ఉధృతం అయింది. బెంబేలెత్తిపోయిన యాజమాన్యం శేషగిరిని తమ దారి నుండి తొలగించడానికి శతవిధాల ప్రయత్నించింది. తప్పుడు కేసులు బనాయించి పోలీసులు అరెస్టు చేస్తే శేషగిరి తప్పించుకొని విజయవాడకు చేరుకొని కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన నిర్వహించబడుతున్న శిబిరంలో గెరిల్లా శిక్షణ పొందారు. ఆ తర్వాత తెలంగాణాలో గెరిల్లా పోరాటంలో పాల్గొంటూనే కొత్తగూడెం గని కార్మికోద్యమానికి రహస్యంగా నాయకత్వం వహించే వారు. అలా కొత్తగూడెం వచ్చి, దళాన్ని చేరుకుంటున్న సమయంలోనే ఆయన ఒక ద్రోహి అందించిన సమాచారం ఆధారంగా పోలీసులకు చిక్కారు. ఆయనను, ఆయనతో పాటు దొరికిన మరో ఇద్దరిని కాల్చి చంపారు.

అమర వీరుడు శేషగిరి గురించి గాని, అప్పటి సింగరేణి కార్మికోద్యమం గురించి కాని ఏదో క్లుప్తంగా తప్ప ఇంతవరకు సమగ్ర సమాచారం లేదు. సింగరేణిలో ఉద్యోగిగా చేరిన పి. చంద్ ఆ కర్తవ్యాన్ని భుజాన వేసుకొని ఏళ్ళ తరబడి ఎన్నో వ్యయప్రయాసల కోర్చి కృషి చేశారు. ఆనాటి ఉద్యమంలో పాల్గొన్న వారిని, సంబంధం వున్న వారిని కలుసుకొని అప్పటి పరిస్థితుల గురించి వాతావరణం గురించి అవగాహన చేసుకున్నారు. సర్వదేశభట్ల రామనాథం లాంటి నాయకులను కలుసుకొన్నారు. సేకరించిన సమాచారాన్నంతా కేవలం ఒక జీవిత చరిత్ర, యూనియన్ చరిత్ర మాదిరిగా కాకుండా ఒక నవలగా మలిచారు. అలా చెబుతున్నపుడు రచయిత కొన్ని చోట్ల తనవూహ శక్తిని కూడా జోడించే అవకాశం ఉంది. ఏదేమయినప్పటికీ నవల ఆనాటి కార్మికుల దుర్భర పరిస్థితిని, వారి పోరాటాలను, వాటి నాయకత్వం వహించిన శేషగిరి లాంటి నాయకుని గురించి కళ్ళకు కట్టినట్లు వివరిస్తుంది ఈ నవల. ఈ పుస్తకాన్ని తీసుకురావడంలో రచయిత జరిపిన కృషి ఎంతైనా శ్లాఘనీయం.

అయితే ఇదే సమయంలో ఒకటి రెండు విషయాల గురించి తప్పనిసరిగా చెప్పుకోవాలి. శేషగిరి ఒకచోట తన సంభాషణలో ఆనాటి జాతీయోద్యమానికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ దళారీ బూర్జువా వర్గం చేతిలో పనిముట్టు అని చెబుతారు. 'దళారీ బూర్జువా వర్గం' అనే మాటను 1941లో శేషగిరి వాడారా అన్న ఆశ్చర్యం కలుగుతుంది. రెండో విషయం ఏమంటే, సమాచారం కోసం ఎంతోమందిని కలుసుకున్న రచయిత, ఉద్యమాన్ని మధ్యలోనే వదిలిపెట్టి కాంగ్రెస్‌లో చేరిన చలపతిని సైతం కలుసుకొని జ్ఞాపకాలను తీసుకున్నట్లు చెప్పారు. కాని ఆనాటి సింగరేణి కార్మికోద్యమ నాయకుల్లో ఒకరిగా, శేషగిరి ప్రధాన సహచరునిగా వున్న పర్సా సత్యనారాయణను మాత్రం సమాచార సేకరణ కోసం కలుసుకొన్నట్లు ఆయన తెలపలేదు. మార్క్సిస్టు పార్టీ నాయకుడుగా, కార్మికవర్గ ఉద్యమంలో ఇప్పటికీ కొనసాగుతూ సి.ఐ.టి.యు. రాష్ట్ర అధ్యక్షునిగా సుదీర్ఘకాలం పని చేసిన పర్సాను ఆయన ఎందుకు కలుసుకోలేదో అర్థం కాదు. ఈ పరిమితులు ఉన్నప్పటికీ ఒక అమరవీరుని పోరాట గాథను ఉత్తేజభరితంగా పాఠకుల కందించిన రచయిత అభినందనీయులు.

- విజయరావు

శ్రీకారం



1937 రైతు రక్షణ యాత్రకు నేపథ్యం తెలియచేస్తూ బ్రిటీష్ ప్రభుత్వం తన వలస దోపిడీని సుస్థిరం చేసుకోవడానికి భారతదేశం భూసంబంధాలలో తీసుకొచ్చిన మార్పులు, శాశ్వత శిస్తు పద్ధతి, రైత్వారీ విధానం, మహల్వారీ విధానాల ఫలితంగా ప్రవేశ పెట్టిన జమిందారీ ఫ్యూడల్ వ్యవస్థ స్వరూప స్వభావాలను ఈ గ్రంథంలో సవివరంగా పేర్కొన్నారు. ఈ విషయాలు నేటి చదువరులకు, పరిశోధకులకు ఎంతో విజ్ఞానదాయకంగా వుంటాయి.

చరిత్రాత్మక ఆంధ్ర రైతు రక్షణ యాత్ర

రచన : ఆచార్య వకుళాభరణం రామకృష్ణ వెల: రూ. 40,
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.



ఏ వయసు వారైనప్పటికీ జీవితంలోని అన్ని దశల్లోనూ ఎలా వ్యవహరించడం ద్వారా ఆనందాన్ని అనుభవించవచ్చో వివరిస్తూ హిప్నో కమలాకర్ కలం నుంచి జాలువారిన సామాజిక మనోవైజ్ఞానిక గ్రంథమే ఇది.

జీవితాన్ని ఎలా అనుభవించాలి...?

రచన : హిప్నో కమలాకర్; **వెల:** రూ. 20/–;
ప్రతులకు : జె.పి. పబ్లికేషన్స్, గాంధీనగర్, విజయవాడ.



నాటికలు, ఏకపాత్రలు పాటలు, కోలాటం, డాన్సులు అన్ని రకాల కళల ద్వారా కళాజాతాను నిర్మించి గిరిజన సాంస్కృతిక బాణిలో రూపొందించే అన్ని రకాల గిరిజన జాతుల్లో ఆరోగ్య రక్షణపై అవగాహన కలిగించిన గ్రంథం ఇది. ఈ ప్రదర్శనలో ఖమ్మం జిల్లా నుండి శ్రీకాకుళం, నల్గొండ, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలకు విస్తరించి ప్రజలను ఆకట్టుకున్నాయి.

మనకోసం

(ఆహారం, ఆరోగ్యం, బాలవెలుగు-కళారూపాలు)

రచన : కె. సీతారాములు; **వెల:** రూ. 40/–;
ప్రతులకు : కె. సీతారాములు, వార్డెన్, ప్రభుత్వ ఎస్.టి. బాలుర హాస్టల్, గార్ల పోస్ట్, ఖమ్మం జిల్లా